# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పంట నష్టపోయిన రైతులకు రేపటిలోగా పరిహారాన్ని అందజేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ ప్రభుత్వ పథకాల పంపిణీ పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.
- ❖ పేద మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని మంత్రి పొంగూరి నారాయణ తెలిపారు.
- ❖ శ్యామలాంబ అమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులకు సూచించారు.

==================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అమరావతిలోని సచివాలయంలో.. గత రెండు రోజులుగా రాష్ట్రంలో కురిసిన వర్షాలపై వ్యవసాయ, విపత్తుల నిర్వహణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి.. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు రేపు సాయంత్రంలోగా పరిహారం అందజేయాలని అధికారులను ఆదేశించారు. పంటనష్టాన్ని వెంటనే అంచనా వేసి.. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే.. పిడుగుపాటుతో చనిపోయిన 8 మంది బాధితుల కుటుంబాలకు కూడా వెంటనే పరిహారం అందించాలన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇంకా వర్ష సూచన ఉన్నందున కలెక్టర్లు, అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షకు దృశ్య మాధ్యమం ద్వారా హాజరైన జిల్లా కలెక్టర్లు.. వర్ష ప్రభావిత జిల్లాల్లో జరిగిన పంట, ప్రాణ నష్టం వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేశారు.

==================

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛను అందించే బాధ్యత అధికారులదేనని రాష్ట్ర సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఈరోజు ఆయన అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. పింఛను పంపిణీలో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రభుత్వ పథకాల పంపిణీ పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. అకాల వర్షాలు, పంట నష్టంపై ముఖ్యమంత్రి ఇప్పటికే సమీక్ష నిర్వహించారని, కొన్ని చోట్ల ధాన్యం తడిచినట్లు జిల్లా కలెక్టర్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ధాన్యం ఎలా ఉన్నా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 23 సెకన్లు)

==================

శ్యామలాంబ అమ్మవారి పండుగను వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. అమ్మవారి పండుగ నిర్వహణపై ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, చైర్ పర్సన్ పి. ఈశ్వరమ్మలతో కలిసి మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 15 సంవత్సరాల తరువాత గ్రామదేవత శ్యామలాంబ ఉత్సవాలు ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ఈ పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. సుమారు 11 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, తగిన విధంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు.

==================

వచ్చే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈరోజు ఆయన హిందుపూరులో స్థానిక శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడతూ ... మంత్రి నారా లోకేష్.. మంగళగిరి నియోజకవర్గంలో వెయ్యి కోట్ల రూపాయాల విలువైన ఇళ్ల స్థలాల స్వాధీన పత్రాలను 3 వేల మందికి పంపిణీ చేశారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని వాగ్దానాలను తప్పక అమలు చేస్తామన్నారు. అమరావతి నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం పూర్తి స్థాయిలో ఉంటుందని, అలాగే రాజధాని కలుపుతూ జరిగే అన్ని రహదారుల నిర్మాణాలు త్వరగా జరగాలని ప్రధానమంత్రి కోరుతున్నారని మంత్రి తెలిపారు.

విరామం

==================

పేద మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. స్మార్ట్ స్ట్రీట్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోనే తొలిసారిగా నెల్లూరులో ఏర్పాటు చేసిన తృప్తి క్యాంటీన్ ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నలుగురు మెప్మా మహిళలతో ఈ క్యాంటీన్ ను ప్రారంభించామని.. దీని ద్వారా నాలుగు కుటుంబాలకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఇదే తరహాలో రాష్ట్రంలో 3 వేల మంది మెప్మా మహిళలతో 750 క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని తెలియజేస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

==================

బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష వాహనాన్ని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రీయ బాల సురక్షా కార్యక్రమంలో భాగంగా బాలల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఈ వాహనాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. దీని ద్వారా చిన్నారుల ఆరోగ్యం మెరుగు పడటమే కాక.. బాలల ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడానికి ఇది సహాయ పడుతుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా.. గుర్తించిన లోపాలు గల

పిల్లలను.. వారికి దగ్గరలో ఉన్న బాలల సత్వర చికిత్సా కేంద్రానికి తీసుకువచ్చి.. చికిత్స అనంతరం తిరిగి దింపే విధంగా ఉచిత సేవలు అందించేలా రెండు వాహనాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ వాహనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

==================

ప్రభుత్వ సేవలన్నీ పౌరులకు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ సేవలను ప్రజలు ఎలాంటి అవరోధాలు లేకుండా ఆన్‌లైన్‌లో పొందేలా చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా ప్రభుత్వ శాఖలన్నీ తమ కార్యకలాపాలను మెరుగుపరచుకోవాలని చెప్పారు. డ్రోన్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు కల్పించాలని అన్నారు. ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ... డేటా లేక్ పనులు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 273 రకాల సేవలు అందిస్తున్నామని, జూన్ 12వ తేదీలోగా 370 నుంచి 380 సేవలను అందిస్తామని తెలియజేసారు.

==================

పాడేరులోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, అధికారులు డీఎన్వీ రమణ, తహసీల్దారు పి. రామకృష్ణ పాల్గొని వినతులు స్వీకరించారు. వీటిలో పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందని, మిగిలిన వాటిని పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపడం జరిగిందని సింహాచలం తెలిపారు. సమస్యలను తగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

==================

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలంలో జరిగిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దాదాపు వంద మంది ప్రజలు అర్జీలు అందజేశారన్నారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై అర్జీలు వచ్చాయని, విద్యుత్, పంచాయతీ రాజ్ విభాగానికి సంబంధించిన సమస్యలు కూడా వచ్చాయని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

==================

రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఈరోజు అనకాపల్లి జిల్లాలో పర్యటించారు. పెందుర్తి నియోజకవర్గం వేపగుంటలో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం పనులను మంత్రి పరిశీలించి, అధికారులను నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కళ్యాణ మండపం నిర్మాణాన్ని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వేపగుంట పరిధిలో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రజల కోసం మండపం నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

==================
==================